క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్

హనుమంతునిపాడు: బిడ్డకు పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కమల కుమారి మరియు హెల్త్ సూపర్ వైజర్ జి. బాలు అన్నారు. శుక్రవారం హనుమంతునిపాడు అంగన్ వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు షేక్ గౌస్‌నీషా బేగం, ఎంఎస్‌కే ముబీన, హెల్త్ సిబ్బంది, గోవిందరెడ్డి, సత్యం, పద్మావతి తదితరులున్నారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన విజిలెన్స్ డైరెక్టర్

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్టీసీ డిపోను ఏపీ రోడ్డు రవాణ సంస్థ విజయవాడ విజిలెన్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ టి. శోభా మంజరి శుక్రవారం తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది, కార్మికులు సమన్వయంతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు. డీఎం బి. శ్రీమన్నారాయణ, ఏవీ రమణమ్మ, ఏడీసీలు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

కోటతిప్పల యువకునికి డాక్టరేట్

హనుమంతునిపాడు: కోటతిప్పల ఎస్సీ కాలనీ వాసి శుద్ధికట్టు మహావిష్ణు అమెరికాలోని మౌంట్ ఎల్బర్ట్ విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్ర విభాగం నుంచి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నట్లు శుక్రవారం ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని నాగోల్ డివిజన్‌లోని శ్రీ చైతన్య కాలేజీలో కెమిస్ట్రీ సీనియర్ లెక్చరర్‌గా 16 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మహావిష్ణును అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరి రూరల్: కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీసీపల్లి: అలవలపాడు, వెంగళాపురం, నేరేడుపల్లి, గుదేవారిపాలెం, చింతలపాలెం, రామాపురం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు విద్యుత్ ఏఈ లక్ష్మీ ప్రసన్న తెలిపారు.

పామూరు: వగ్గంపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 6.30 గంటల నుంచి 9.30 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జిలానీ తెలిపారు. రావిగుంటపల్లి, వగ్గంపల్లి, చింతలపాలెం, చిలంకూరు, గోపాలపురం, వీరభద్రాపురంలో కూడా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

హనుమంతునిపాడు: మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు హాజీపురం నుంచి వీరరాంపురం వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ దినకర్ బాబు ఒక ప్రకటలో తెలిపారు. వినియోగ దారులు గమనించాలని కోరారు.

చంద్రబాబును జైల్లో పెట్టాలి

- రూ.118 కోట్ల ముడుపులు తీసుకుని అడ్డంగా ఐటీకి దొరికారు
- ఐటీ నోటీసులకు జవాబివ్వకుండా ప్రభుత్వంపై బిందులేల?
- జైలు ఖాయమని గ్రహించే విద్వేషం రగిల్చేందుకు చంద్రబాబు కుట్రలు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

సింగరాయకొండ: నారా చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న 2014–19 మధ్య కాలంలో 118,98,13,207 రూపాయల అవినీతి సొమ్ముకు సంబంధించి ఇన్‌కంటాక్స్ అధికారులు నోటీసులు ఇస్తే అధికార పార్టీ కుట్ర చేస్తోందని చంద్రబాబు గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వరికూటి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం ఒక ఏడాదికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లోనే ఇన్ని కోట్ల అవినీతి జరిగిందని ఐటీ అధికారులు తేల్చారంటే.. చంద్రబాబు సీఎంగా ఉన్న 14 సంవత్సరాల్లో జరిగిన లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరిపితే లక్షల కోట్ల రూపాయల అవినీతి బయటపడటం ఖాయమన్నారు. షాపూర్జీ–పల్లోంజీ, ఎల్‌అండ్‌టీ అనే రెండు కంపెనీల నుంచి వచ్చిన డబ్బు వివరాలు చంద్రబాబు ఈమెయిల్స్‌లో నమోద య్యాయని ఈ లావాదేవీలకు సంబంధించి వాట్సాప్‌లో చాటింగ్ కూడా ఉందన్నారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులు మొదట షాపూర్జీ–పల్లోంజీ అనే కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని మీద దృష్టి సారించి తీగ లాగితే కొంత డొంక కదిలిందన్నారు. మనోజ్ వాసుదేవ్ అనే వ్యక్తి చంద్రబాబుకు నేరుగా అవినీతి డబ్బు చేరవేసినట్లు పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత ఐటీ అధికారులు సుమారు రూ.119 కోట్లకు లెక్కలు చెప్పాలని షోకాజ్ నోటీసు ఇచ్చారని తెలిపారు. అయితే చంద్రబాబు ఈ నోటీసును ఖండించలేదని, కింది స్థాయి అధికారులు కాకుండా సెంట్రల్ శాఖలోని అధికారులు ఎలా ఇస్తారని బుకాయించడం విడ్డూరంగా ఉందన్నారు.

చంద్రబాబు నాయుడు అమరావతిలో శాశ్వత భవనాలు కట్టకుండా తాత్కాలిక భవనాలు మాత్రమే నిర్మించారని గుర్తు చేశారు. తెలంగాణలో స్క్వేర్ ఫీట్‌కు రూ.5 వేల నుంచి రూ.6 వేలు ఖర్చు చేస్తే బాబు మాత్రము రూ.12 వేలు ఖర్చు చేశారని, ఈ విధంగా సబ్ కాంట్రాక్టులకు పనులు ఇచ్చి వందల కోట్ల రూపాయల ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. బాబు పీఏ శ్రీనివాసరావు ఇంట్లో రూ.2 వేల కోట్ల అవినీతి సొమ్ము దొరికిందని ఐటీ అధికారులు మూడేళ్ల క్రితమే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు 1.40 లక్షల టిడ్కో ఇళ్లకు కాంట్రాక్టు ఇస్తే కేవలం 23 వేల ఇళ్ల నిర్మాణమే పూర్తయిందని, ఇంత జరుగుతున్నా పచ్చ పత్రికలు ఈనాడు, తోకపత్రిక, ఈటీవీ, టీవీ5, ఏబీఎన్ యాజమాన్యాలు తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరిస్తూ ఒక్క వార్త కూడా ప్రచురించలేదని దుయ్యబట్టారు. చంద్రబాబు నుంచి ఎంత వాటా తీసుకున్నారని ఎల్లో మీడియా యాజమాన్యాలను ప్రశ్నించారు.

జైలుకు వెళ్తాడని తెలిసే బాబు, చినబాబు రచ్చ

చంద్రబాబు తాను జైలుకు వెళ్లడం ఖాయమని నిర్ధారించుకుని పుంగనూరు నుంచి ప్రజలను రెచ్చగొట్టి రాష్ట్రంలో అశాంతి సృష్టిస్తున్నారని వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. చంద్రబాబు కొడుకు లోకేష్ పాదయాత్ర పేరుతో రౌడీలను వెంటబెట్టుకుని దాడులకు తెగబడుతున్నాడని, తన ప్రసంగాలతో పచ్చమూకలను రెచ్చగొడుతున్నాడని నిప్పులుచెరిగారు. వారి బాటలోనే కొండపి ఎమ్మెల్యే స్వామి కూడా నడుస్తున్నాడని విమర్శించారు. బాబుకు దీటుగా పేదల మరుగుదొడ్ల సొమ్మును స్వామి నొక్కేశాడని ఆరోపించారు. సామాన్యుడు తప్పు చేస్తే వెంటనే జైలుకు పంపిస్తారని, ఇంత భారీ మొత్తంలో అవినీతికి పాల్పడిన చంద్రబాబును కూడా జైల్లో పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సామంతుల రవికుమార్‌రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, ఎంపీటీసీ ఏపూరి శ్రీనివాసులు, లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, షేక్ పటేల్, పాకనాటి సుబ్బారెడ్డి, ముళ్లపూడి సత్యన్నారాయణ, షేక్ సలీంబాషా, షేక్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభం తొలిగింది.. సమస్య తీరింది

- హామీ నెరవేర్చిన వరికూటి

జరుగుమల్లి: మండలంలోని చింతలపాలెం ఎస్సీ కాలనీలో వెన్నముద్దల వెంకటేశ్వర్లు ఇంటి ఆవరణలో ఓ విద్యుత్ స్తంభం ఉంది. దానిని తొలిగించి పక్కన ఏర్పాటు చేయాలని గత 12 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం అడుగు భాగాన పూర్తిగా శిథిలమైంది. దీంతో ఎప్పుడు కూలి ఎవరి ప్రాణాలు బలి తీసుకుంటుందోనని స్థానికుల్లో ఆందోళన మొదలైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే స్వామికి తెలిపినా ప్రయోజనం లేకుండా పోవడంతో మిన్నకుండిపోయారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు స్థానిక నాయకుడు బద్దిపూడి సురేష్ ద్వారా సమస్యను వివరించారు. దీంతో వెంటనే స్పందించిన వరికూటి తన సొంత ఖర్చులతో శిథిలమైన స్తంభాన్ని తొలగించి, మరో స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. పుష్కర కాలంగా ఇబ్బంది పెడుతున్న సమస్య తీరిపోవడంతో వెంకటేశ్వర్లుతోపాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



నూతన స్తంభాన్ని వేస్తున్న సిబ్బంది

ఆర్బీకేల్లో పంపిణీకి సిద్ధంగా ఎరువులు

టంగుటూరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి స్వర్ణలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఒకటో ఆర్బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ మల్లవరపు జయరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ స్వర్ణలత మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకు 2625 ఎకరాల్లో సాగు చేసిన పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా ఈ కేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. అలాగే 15వ తేదీలోగా బయోమెట్రిక్ అథెంటికేషన్ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎరువు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు గురించి ఆ శాఖ అధికారి తేజ వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ శ్రీవాణి, ఏఈఓ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ స్వర్ణలత

జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ శ్రీశైలానికి పాదయాత్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి

సింగరాయకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ అఖండ విజయం సాధించాలని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింస్వామి దేవస్థానం నుంచి శ్రీశైలం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు ఆ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక డాక్టర్ శివరామిరెడ్డి హాస్పిటల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాదయాత్ర వివరాలను డాక్టర్ బత్తుల వెల్లడించారు. శనివారం ఉదయం 6.30 గంటల నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని, 250 కిలోమీటర్లు నడిచి ఈనెల 16వ తేదీన శ్రీశైలం చేరుకుంటారని వివరించారు. సమావేశంలో శీలం రాము, ఏఎంసీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి, చిమట శ్రీను, హనుమంతరావు, సుదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



అగ్రహారంలో అక్షరాస్యతపై వివరిస్తున్న ఎఈవో కొండారెడ్డి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల్లో అక్షరాస్యతాభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. 11వ వార్డులోని కాశిరెడ్డి కాలనీలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ సంస్థల ప్రతినిధులు రమేష్‌బాబు, నవకుమార్, కిరణ్‌కుమార్, అనుష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని అందించండి

పట్టణంలోని దేవాంగనగర్ లో శుక్రవారం అంగన్ వాడీ కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పోషకాహారాన్ని, ఎండీఎం అందచేయాలని తెలిపారు. టీచర్ షాహిదా బేగం, ఉపాధ్యాయురాలు దీవెన, శంషాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా ఓ వరం

వైఎస్సార్ బీమా పథకం పేదవర్గాలకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. 11వ వార్డులోని కాశీపురంలో అనారోగ్యంతో మృతి చెందిన సింగంరెడ్డి పెద్ద వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు శుక్రవారం వైఎస్సార్ బీమా నగదు రూ. 10వేలు అందచేశారు. దారుకుమల్లి హైమావతి, బండారు తిరుపతిరావు, కొటిరెడ్డి, మాలకొండారెడ్డి, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యం

సీఎస్‌పురం (పామూరు): మండలంలో నూరుశాతం అక్షరాస్యతే లక్ష్య సాధన దిశగా ఉపాధ్యాయులు, వలంటీర్లు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు కృషి చేయాలని మండల రెండో విద్యా దికారి రాజాల కొండారెడ్డి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని కె.అగ్రహారం, ఆర్‌కే.పల్లి పాఠశాలల్లో మాట్లాడారు. సర్పంచ్ అంబాల లక్ష్మీదేవి, చీర్లదిన్నె రాధ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లు పి.చిరంజీవి, సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న తోడు సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి: గ్రామ సమాఖ్య సంఘాలు జగనన్న తోడు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి ఏరియా కోఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ తెలిపారు. శుక్రవారం పెదచెర్లోపల్లిలో మాట్లాడుతూ 100 శాతం రికవరీ జరగాలన్నారు. డీపీఎం నరసింహారావు, నూతన ఏపీఎం సత్యానంద్, ఎల్‌సీ సుబ్రహ్మణ్యం, సీసీలు తిలకమ్మ, మరియమ్మ, చిరువ్యాపారుల కోసం.. జగనన్న తోడు రుణాల కోసం బయోమెట్రిక్ వేయించి, దరఖాస్తులు బ్యాంకుకు సమర్పించాలని తెలిపారు.

లక్ష్య సాధన దిశగా అభ్యసించాలి



జీజేసీలో ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న పీసీపల్లి ప్రిన్సిపాల్ ఖాసింపీరా

పామూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన దిశగా విద్యనభ్యసించాలని పీసీపల్లి జీజేసీ ప్రిన్సిపాల్ ఖాసింపీరా అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ జె.సురేష్‌రెడ్డి అధ్యక్షతన ఇంటర్మీడియెట్ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అధ్యాపకులు రాజేంద్ర, జీహెచ్ఎస్ హెచ్‌యం రామస్వామి, పీపుల్స్ రైట్ సభ్యులు షేక్.అల్లాబక్షు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ముగ్గురు ఎంపిక

సింగరాయకొండ: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు హెచ్ఎం డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. సింగరాయకొండలో ఈనెల 6వ తేదీ నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో అండర్–16 విభాగం 100, 300 మీటర్ల రన్నింగ్‌లో కె.సిపోరా ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడని తెలిపారు. జి.తిరుపతి 800 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, అండర్–18 విభాగంలో కె.నందిని డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానంలో నిలిచారని వివరించారు. వీరు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



వేములపాడులో అట్రాసిటీ కేసు విచారిస్తున్న డీఎస్పీ

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

హనుమంతునిపాడు: ఎస్సీ, ఎస్టీ కేసుపై శుక్రవారం కనిగిరి డీఎస్పీ రామరాజు గ్రామానికి వెళ్లి ఇరు వర్గాలవారిని విచారించారు. ఈ నెల మూడో తేదీన పాత కక్షలు మనసుల్లో పెట్టుకొని వెన్నపూజల రమణయ్య, ఏడుకొండలు.. రక్షణాపురం ఎస్సీ కాలనీ వాసులు కొదమల నాగేశ్‌ల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఎస్సీ కులానికి చెందిన కొదమల నాగేశ్‌కు, కొదమల ఇస్మాయిల్‌కు గాయాలయ్యాయి. నాగేశ్, ఇస్మాయిలు, వెన్నపూజల రమణయ్య, ఏడుకొండలు పాత కక్షలు మనసులో పెట్టుకొని కులంపేరుతో దూషించి కర్రలతో కొట్టి గాయ పరిచారని పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. విచారించి వెన్నపూసల రమణయ్య, ఏడు కొండలుపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసును కనిగిరి డీఎస్పీ రామరాజు వేములపాడు వెళ్లి గ్రామస్తులతోను ఇరువర్గాల వారిని విచారించారు. ఎస్సై శివనాగరాజు పోలీసు సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు

పొన్నలూరు: గ్రామాల్లోని అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు మంజూరు చేస్తున్నారని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో కొత్తగా మంజూరైన 11 పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వెంటనే అర్హతే ప్రామాణికంగా 24 రకాల పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. పొన్నలూరు మండలంలోని 15 సచివాలయాల పరిధిలో కొత్తగా 140 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇండ్లా హరినారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పొన్నలూరులో కొత్త పింఛను అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో వరికూటి దంపతులు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరాలు ఇచ్చే వరలక్ష్మీ మాతా మమ్మల్ని దీవించి నిత్యం కాపాడమని భక్తులు వేడుకున్నారు.

వలేటివారిపాలెం: మండల కేంద్రమైన వలేటివారిపాలెం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. మహిళలు ముందుగా పొంగళ్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కనిగిరి రూరల్: స్థానిక షిరిడి సాయిబాబా దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం కుంకుమ పూజలు చేశారు. దేవస్థాన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పామూరు: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం వేడుకలను ప్రజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, గురునాథప్రసాద్, రాఘవ సుమన్‌లు అమ్మవార్ల మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించి అనంతరం కుంకుమపూజ నిర్వహించారు.

వైభవంగా పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

జరుగుమల్లి: మండలంలోని వర్ధినేనివారిపాలెంలో గ్రామ దేవత పోలేరమ్మ తల్లి నూతన ఆలయ ప్రారంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం కలశ ఆలయ ప్రవేశం, జీవన్యాస, ప్రాణ ప్రతిష్ఠ, దర్శన, మహా కుంభాభిషేకం, అలంకరణ పూజ, హారతి, పూర్ణాహుతి, తిలక ధారణ నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, సతీమణి లక్ష్మి పాల్గొన్నారు. స్థానిక నాయకులు యామసాని భాస్కర్, యామసాని శ్రీను, గాలి శ్రీను, గాలి కృష్ణమూర్తి, బొట్లగుంట మాల్యాద్రి, ఎండ్లూరి సుధాకర్‌రావు, కర్రావుల బ్రహ్మయ్య, పచ్చవ బ్రహ్మయ్య, బండి నర్సారెడ్డి తదితరులు హాజరయ్యారు.

పోలేరమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవస్థానంలో శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేశారు. పూజల్లో 500 మంది మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. భక్తులకు జాకెట్, గాజులు, అమ్మవారి ఫొటో, పసుపుదారం, ప్రసాదం అందజేశారు. ఆలయ చైర్మన్ ఎస్.కొండయ్య, ఈఓ శివశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కలశాలతో నీరు తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం శివపార్వతి కల్యాణోత్సవ ఘట్టం కనుల పండువగా సాగింది. ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అలంకరించిన చీరకు వేలం నిర్వహించగా శ్రీధర్ అనే వ్యక్తి 25,500 రూపాయలకు దక్కించుకున్నారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు చీరలు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అమ్మవారి దేవస్థానం నిర్మించి 25 ఏళ్లయిన సందర్భంగా కుంభాభిషేకం నిర్వహించినట్లు పేర్కొన్నారు.



ఉలవపాడులో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



శివపార్వతుల కల్యాణోత్సవ ఘట్టం



పామూరు: విశిష్ట అలంకరణలో వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు



కనిగిరి: కుంకుమ పూజల్లో భక్తులు



వలేటివారిపాలెం: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పామూరులో 'బుల్లెట్ బాబు' షూటింగ్

పామూరు: బుల్లెట్ బాబు చిత్ర యూనిట్ సభ్యులు పామూరులో శుక్రవారం సందడి చేశారు. చిన్మయి క్రియేషన్స్ బ్యానర్‌పై సురేష్‌బాబు దర్శకత్వంలో నిర్మాత వెంకటేశ్వరరెడ్డి నటీ నటులు శివప్రసాద్, రిషిత, వర్షిత, శ్రీలత జంటగా నిర్మిస్తున్న చిత్రం బుల్లెట్ బాబు. చిత్ర నిర్మాణానికి మండల జెడ్పీటీసీ సభ్యుడు చప్పిడి సుబ్బయ్య క్లాప్ కొట్టగా, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు కెమెరా స్విచ్ ఆన్‌చేశారు. స్క్రిప్ట్‌ను గట్లావిజయబాస్కర్ రెడ్డి చిత్ర నిర్మాత, దర్శకునికి అందజేశారు. నిర్మాత, దర్శకులు మాట్లాడుతూ పక్కా పల్లెటూరి వాతావరణంలో బంధాలు, అనుబంధాలు, బావా మరదళ్ల ప్రేమ సందడితోపాటు హాస్యం ప్రధాన భూమికగా చిత్రనిర్మాణం ఉంటుందని, బొట్లగూడూరు, బోడవాడ ప్రాంతాల్లో రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందన్నారు. కొల్లూరి రవికిరణ్‌శర్మ, గుర్రం వెంకటేశ్వర్లు, జె.గోవిందయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ తేజ, కెమెరామెన్ వాసువర్మ, సహాయ నిర్మాత కూచిపూడి కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బుల్లెట్ బాబు షూటింగ్‌లో చిత్ర బృందం, నాయకులు